# తృప్తి

— కోసూరి వెంకట కోటేశ్వరరావు

రాజశేఖర్‌ది ప్రభుత్వోద్యోగం. ఆఫీసరు. అమూల్య డిగ్రీ చదివిందిగానీ ఉద్యోగం ఏమీ చేయడంలేదు. సంతానం లేకపోవడం తప్ప ఏ లోటూలేదు. ఎన్నో నోములు నోచింది. వ్రతాలు చేసింది. పుణ్యక్షేత్రాలు తిరిగారు. డాక్టర్లతో ఎన్నో టెస్టులు చేయించారు. చివరకు తేలింది ఒక్కటే. అమూల్యా మాతృత్వానికి అనర్హురాలు.

ఇది వారి జీవితానికి తీరని లోటు. కాలం గడిచేకొద్దీ ఇటు చుట్టుప్రక్కల, అటు బంధువుల్లోనూ సూటిపోటి మాటలు, చులకన భావం.


''ఏమండీ! మనం విడాకులు తీసుకుందాం. మీరు ఎవర్నైనా పెళ్లి చేసుకోండి. ఆమెకు పిల్లలు కలిగినా నాకు సంతోషమే.''

అందుకు రాజశేఖర్ చాలా బాధపడ్డాడు.

''అమ్మూ! అలా అనకు. అదే నాలో లోపం వుండి వుంటే నీవు ఇంకో పెళ్లి చేసుకోగల్గుతావా? ఎప్పుడూ అటువంటి ఆలోచనలు నీలో రానీయకు. ఇది భగవంతుని నిర్ణయమేమో?'' అన్నాడు ఎంతో అనునయంగా.

• • •

అనాథ శరణాలయం ముందు స్కూటరు ఆపి లోపలికెళ్లారు. అక్కడి ఇన్‌ఛార్జితో తమని తాము పరిచయం చేసుకుని విషయం అంతా చెప్పారు.



అక్కడున్న పదిహేనుమంది పిల్లల్ని చూపించారు. సంవత్సరంలోపు చిన్న ఆడపిల్ల అయితే బాగుండునని అనుకున్నాడు రాజశేఖర్. అయితే ఆడపిల్లలు ఏడెనిమిది సంవత్సరాలు పైబడ్డవారు ఇద్దరున్నారు. సంవత్సరం లోపు వయసున్న ఓ పిల్లవాడు ఉన్నాడు. చూడముచ్చటగానే ఉన్నాడు. ఆ బాబును సెలెక్ట్ చేసుకున్నారు. ఆ బాబును తాము తెచ్చుకోవాలంటే కొన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేయాల్సి వస్తుంది. కొంత టైం పడుతుంది. ఓ మంచిరోజు చూసి తీసుకువెళ్తామని చెప్పి ఇంటిముఖం పట్టారు. ఇల్లు ఇంకో ఫర్లాంగు దూరం ఉందనగా ఓ వృద్ధుడు ఫుట్‌పాత్‌మీద పడి వున్నాడు. పక్కనే సంచి. ఎవరూ పట్టించుకోవడంలేదు. కొద్ది క్షణాలు చూసారు. పాపం ఎవరో అనుకున్నారు. వెంటనే ఇంటికెళ్లి మంచినీళ్ళు తెప్పించాడు అమూల్యతో. శ్వాస ఆడుతున్నట్లు గమనించాడు.

మంచినీళ్ళు అతని ముఖంమీద చిలకరించాడు. ఆయన కళ్ళు తెరవడానికి ప్రయత్నం చేస్తూనే నోరు కొద్దిగా తెరిచాడు. ఒక్కో చుక్క ఒక్కో గుటక వేస్తున్నాడా వృద్ధుడు. నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. ఇంకో నలుగురు వచ్చారక్కడకు. వారందరి సాయంతో ఆ వృద్ధుడిని తమ ఇంటికి తీసుకువచ్చారు అమూల్య రాజశేఖర్ దంపతులు.

ఫ్యాన్ క్రింద మంచం వేసి పడుకోబెట్టి అతని శరీరమంతా తడిగుడ్డలతో తుడిచారు. అన్నంలో ఎక్కువ మజ్జిగ పోసి ఆ రసాన్ని నోట్లో పోస్తుంటే అతను గుటకలు వేయనారంభించాడు. అలా కొంత సేవ చేసిన తరువాత ఆ వృద్ధుడు స్పృహలోకి రావడం, ఆ సాయంత్రానికి కొద్దిగా కోలుకోవడం జరిగింది. ఆ రాత్రికి కూడా అలాగే చేసారు. మర్నాటికల్లా ఆ వృద్ధుడు లేచి కూర్చున్నాడు. అలా రెండురోజుల్లో వృద్ధుని బలహీనతపోయి కొద్దిగా బలం పుంజుకుని లేచి ఆ ఇంట్లో తిరిగేవరకూ వచ్చాడు.

అమూల్యకు చాలా సంతోషం, తృప్తి కలిగాయి. అతని వివరాలు అడిగితే భోరుమన్నాడు. తనకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళనీ, తన సంపాదనతోపాటు ఆస్తినంతా వారి చదువులకీ, పెళ్లిళ్ళకు ఖర్చు చేసాననీ, భార్యపోయి మూడు సంవత్సరాలు దాటిందనీ, పిల్లలందరూ ఛీ పొమ్మంటే దిక్కు తోచక తిరుగుతున్నానని చెప్పాడు. తాము చేసిన సేవకు ఆ వృద్ధుడు కోలుకోవడం తృప్తినిచ్చిందిగానీ రాజశేఖర్‌లో ఓ ఆలోచన బయలుదేరింది.

• • •

ఓరోజు సాయంత్రం ఆ వృద్ధుడు రాజశేఖర్, అమూల్యలను పిలిచి–

''బాబూ! మీకెంతో రుణపడి వున్నాను. ఎప్పటికి ఏ విధంగా తీర్చుకోగలుగుతానో తెలియదు.

రేపు ఉదయమే నేను బయలుదేరుతాను'' అన్నాడు.

''బాబాయ్'' అంది అమూల్య.

రాజశేఖర్‌లో చిరునవ్వు వెలిసింది.

వృద్ధుడు ఇద్దరివైపు కన్నార్పకుండా చూస్తున్నాడు.

''ఎక్కడికి వెళ్తావు బాబాయ్?''

''ఎక్కడికేమిటమ్మా? అడుక్కునేవాడికి అరవై ఆరు ఊళ్ళు.''

''మీరు ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు. మా ఇంట్లోనే వుండండి. మాకు ఓ పెద్దదిక్కులా వుండండి. మిమ్మల్ని మామయ్యా అని పిలుస్తాను'' అన్నాడు రాజశేఖర్.

రాజశేఖర్ మాటలు ఆ వృద్ధుడ్ని అయోమయంలో పడవేసాయి.

''అవును మామయ్యా. పిల్లలులేని మేము ఎవరైనా బంధువుల పిల్లల్లో ఒకరిని తీసుకొచ్చి పెంచుకుందాం అనుకున్నాం. అలా చేయలేకపోయాం. అనాథాశ్రమం నుంచి ఓ పిల్లవాడ్ని తీసుకొచ్చి పెంచుకుందామని అనుకున్నాం. అయితే అనుకోకుండా అదే రోజు మిమ్మల్ని ఈ స్థితిలో చూడడం, ఇక్కడికి తీసుకురావడం, మీ గురించి వినడం జరిగింది. మా ఆలోచన తప్పనిపించింది.''

''ఎందుకు?'' అన్నాడు వృద్ధుడు ఆశ్చర్యంగా.

''కన్నపిల్లలే వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను చూడనప్పుడు అనాథాశ్రమం నుంచి తెచ్చి పెంచి పెద్దచేసిన తరువాత అతను మమ్మల్ని చూస్తాడని నమ్మకం ఏమిటి? ఇక ఎవర్నీ పెంచుకోవాలన్న ఆశ లేదు. మా ఇంటి పెద్ద దిక్కు మీరే'' అన్నాడు.

''నేను మీకేమౌతానని నన్ను చూస్తున్నారు?'' చిరునవ్వుతో అన్నాడు ఆ వృద్ధుడు.

''నువ్వు ఎవరివో ఇక్కడికొచ్చేవరకూ తెలియదు. నీకు సేవ చేస్తుంటే ఎంతో ఆనందంగానూ, తృప్తిగానూ వుంది మాకు'' అంది అమూల్య.

''అందరూ అలా అనుకుంటే పెళ్లిళ్ళు చేసుకోరు. పిల్లల్ని కనరు. మీరనుకున్నదాంట్లో లోపం వుంది.''

''మా భావన తప్పా?'' అన్నారిద్దరూ.

''అవును బాబూ. పిల్లల్ని కనడం తప్పుకాదు. లేనివారు ఎవరినైనా పెంచుకోవడమూ తప్పుకాదు. కానీ... పిల్లలమీద ఆశలు పెంచుకోవడం తప్పు'' అన్నాడా వృద్ధుడు. ''పిల్లల్ని పెంచి పెద్దచేసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్ది వారిమీద ఆశలు పెంచుకోవడం తప్పెలా అవుతుంది?'' అంది అమూల్య.

''ఆ అనాథ శరణాలయంలో ఎంతమంది వున్నారు?'' ''పదిహేనుమంది వుండవచ్చు.''

''అందరూ అనాథలేనా?'' ''అవును.''

''అంతమంది అనాథలలో ఏ ఒక్కరినో తెచ్చి వాడిని అపురూపంగా చూస్తారు మీరు. ఆ ఒక్కడూ అక్కడ మిగిలిన వారికంటే ఎన్నో రెట్లు సౌకర్యాలను అనుభవిస్తాడు మీ దగ్గర. మరి మిగతావారు?''

''అంతమందిని పోషించలేముకదా?''

''మీరు నన్ను ఇక్కడ వుండమన్నది నామీద జాలితోనా?'' అన్నాడు.

''ముందు జాలితో ఇక్కడికి తీసుకువచ్చినా మీకు సేవ చేస్తుంటే అనుభవించిన ఆనందం ఇకముందు కూడా పొందాలని'' అన్నాడు రాజశేఖర్.

''అంటే,...మీ సేవకు ఫలితం ఆనందమేగా?''

''అవును.''

''అలాగే...పిల్లవాడిని పెంచి పెద్దచేసి బాధ్యతను నెరవేర్చామన్న ఆనందంతోనే తృప్తిపడాలి. అంతేగానీ అతనేదో మిమ్మల్ని ఉద్ధరిస్తాడని ఆశ పెంచుకోకూడదు. ఆ ఆనందం ఎంత గొప్ప తృప్తో నా ద్వారా తెలుసుకున్నారు కదా!'' అవునన్నట్లు తలూపారు.

''నా ఒక్కడితోనే ఇంత ఆనందం అనుభవించారంటే ఆ పదిహేనుమంది పిల్లలకు మీ సేవలందించితే ఇంకెంత ఆనందమోకదా!''

అతని మాటలు పూర్తిగా అర్థంకాక ఒకరి ముఖాలొకరు చూసుకున్నారా దంపతులు.

ఆ వృద్ధుడు చిరునవ్వు నవ్వి–

''బాబూ! అసలు విషయానికొస్తున్నా. నాకు సేవ చేస్తుంటే మీకు కలిగే ఆనందం కోసం నన్ను ఇక్కడ ఉండమంటున్నారు. ఆ సేవ ఒక్క వ్యక్తికి కాకుండా ఆ అనాథ శరణాలయం మొత్తానికి అందజేయండి.''

''ఎలా?''

''ఆ పదిహేనుమంది పిల్లలు మన పిల్లలే అనుకుందాం. వారికి మనం మనకు తోచిన విధంగా సాయం చేయాలి. ఆర్థికంగాగానీ, సేవాపరంగాగానీ. ఒక పద్ధతి ప్రకారం సేవ చేయాలి. అప్పుడు వారందరి మీద ఏ కోరికలూ పెంచుకోం. ఒక్కడిని ఇక్కడికి తీసుకొచ్చి పెంచి పెద్ద చేస్తూ వాడు పెద్ద డాక్టరో, ఇంజనీరో అవాలనీ, మీరు వృద్ధులయ్యాక మిమ్మల్ని చూడాలనీ ఆశలు పెంచుకుంటారు. అవి తీరకపోతే నిరాశకు గురవుతారు. అలాకాక మనం ఇంతమందికి సేవ చేయడంవల్ల ఇటువంటి ఆశలు ఉండవు. సేవ చేయాలి, తృప్తిపడాలి.''

''మరి వృద్ధులమయ్యాక?'' అంది అమూల్య.

''నా పిల్లలు నన్ను చూస్తున్నారా ఈ వృద్ధాప్యంలో? భగవంతుడు కరుణామయుడు. మనం బాధ్యతల్ని నిర్వర్తించాలి. మన బాధ్యత భగవంతుడిపైన వేయాలి. నేనెవరిని? మీరెవరు? చనిపోతాననుకున్న నన్ను మీరు బ్రతికించారు. అదే భగవంతుని లీల. మనం ఇప్పుడు కొంతమందికి చేయూతనిస్తే... భవిష్యత్తులో మనకి ఇంకొకరు చేయూతనిస్తారు.''

ఆ వృద్ధుని మాటలకు పులకించిపోయారు అమూల్య రాజశేఖర్‌లు. ఆ మర్నాడే అనాథ శరణాలయానికి వెళ్లి అక్కడి పిల్లలందరికీ దుస్తులు, ఆడుకోవడానికి బొమ్మలు, పండ్లు మేనేజ్‌మెంట్ అంగీకారంతో పంచిపెట్టారు. ఆ పిల్లల చదువుకోసం ఆర్థికంగా తాను కొంత సహాయం చేయాలనుకున్నాననీ, అమూల్య ప్రతిరోజూ వారికి చదువు నేర్పుతుందనీ చెప్పారు. ఇప్పుడు అమూల్య రాజశేఖర్ దంపతులకు పిల్లలు లేరనే భావం లేదు, బాధ లేదు. ఆ పిల్లలంతా తమ పిల్లలే. వారిని పెంచడంలో కలిగే ఆనందం ఎంతో తృప్తినిస్తోంది ఆ దంపతులకు.

★

## మీరలా కూర్చోండి



''మీ జూలో అన్ని జంతువులు వున్నా కోతి లేకపోవడం లోటుగా వుంది'' అన్నాడు సదానందం.

''పోనీ...ఓ రెండుగంటలు మీరలా కూర్చుంటారా?'' అన్నాడు మేనేజర్.

**-ప్రతాప వెంకట సుబ్బారాయుడు** (జె.జె.నగర్)

## వంట రాదు

''మా ఆయన ఊరెళితే నేనసలు అన్నమే తినను'' గొప్పగా అంది వనజ.

''ఏం...మీవారంటే నీకంత ప్రేమా?'' అడిగింది గిరిజ.

''అదేంకాదు. నాకు వంట చేసుకోవడం రాదు'' అసలు సంగతి చెప్పింది వనజ.

**-పి.వి.సుజాతారాయుడు** (జె.జె.నగర్)

## ఆశ్చర్యం!

''ఆ గోపీగాడు ఆత్మహత్య చేసుకున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది!'' చెప్పాడు రాజా.

''ఆశ్చర్యం దేనికి?!'' అడిగాడు రమేష్.

''వాడికింకా పెళ్ళికాలేదు మరి!''

**- శ్రీనివాస్ వల్లాల** (విఠలాపురం)

## త్యాగం

''నీకోసం ఎన్నో త్యాగాలు చేసాను. చివరకు నా తల్లిదండ్రులను కూడా వదులుకున్నాను.'' అంది ప్రియురాలు రాణి.

''ఓస్ అంతేనా! నేను నీకోసం ఇద్దరు గర్ల్‌ఫ్రెండ్స్‌ని వదులుకుని వచ్చాను'' అన్నాడు రాజా.

**- కృష్ణవేణి** (ఆళ్ళగడ్డ)

